మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## మండలంలో అదనపు కలెక్టర్ పర్యటన



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**బెజ్జంకి,జూలై 28, ప్రభాతవార్త :** గాగిళ్లాపూర్, లక్ష్మీపూర్‌లలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి గ్రామాల్లో చేపట్టిన డంపింగ్ షెడ్,శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం వంటి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఇరు గ్రామాల సర్పంచ్‌లు అడిషనల్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి పూల మొక్కలను అందజేశారు. సీఈఓ రమేష్, డీపీవో దేవకీదేవి, డిఎల్‌పివో మల్లికార్జున్‌రెడ్డి పిఆర్ఈడీ సదాశివరెడ్డి, జిల్లా ఫారెస్టు ఆఫీసర్, అడిషనల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఎంపిపి నిర్మల, జడ్పీటిసి కవిత, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి,తిరుపతిరెడ్డి,ఎంపిటిసిలు మల్లేశం,పద్మారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మహిపాల్‌రెడ్డి, ఎంపిడివో దమ్మని రాము, ఎంపిఓ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

## కేతికి ఆలయంలో రీజనల్ మేనేజర్ పూజలు



కేతకి ఆలయంలో పూజలు నిర్వహించిన రీజినల్ మేనేజర్

**ఝరాసంగం, జులై 28, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువుండి దక్షిణ కాశీగా పూజలందుకుంటున్న కేతకి సంగమేశ్వర ఆలయాన్ని హైద్రాబాద్ సర్కిల్ ఎన్‌డబ్ల్యూ-1 జనరల్ మేనేజర్ మంజు శర్మ శుక్రవారం దరఖ్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జనరల్ మేనేజర్ ఆలయ ఆవరణలోని అమృతగుండంలో సంప్రోక్షణ చేసుకుని ఆలయ గర్భగుడిలో ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మేనేజర్‌కు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేసి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సూర్య ప్రకాశ్, వర ప్రసాద్, ఫీల్డ్ అఫీసర్ కిశోర్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు బసయ్యస్వామి, దిలీ కుమార్ జ్యోషి, హరికిషన్ జ్యోషి, బసయ్యస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

## నిరుద్యోగ సమస్యను పెంచిపోషిస్తున్న కేంద్రం

### బిఆర్‌ఎస్‌వి జిల్లా అధ్యక్షులు మహేష్

**సిద్దిపేట రూరల్, జూలై 28, ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరుద్యో సమస్యను పరిష్కరించకుండ పెంచిపోషిస్తుందని..పనికి మాలిన కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపాల్సి న అవసరం ఎంతైనా ఉందని బిఆర్‌ఎస్‌వి జిల్లా అధ్యక్షులు మెరుగు మహేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే దేశంలో ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పినట్లు స వ్యయంగా కేంద్ర ప్రభుత్వమే ఒప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పార్లమెంటులో బిఆర్ఎస్ ఎంపి ఫ్లోర్ లీడర్ నామ నాగేశ్వరావు అడిగిన ప్రశ్నకు సంబంధిత మంత్రిత్వశాఖ లిఖిత పూర్వకంగా సమాధానం ఇస్తూ గత మార్చి 1 నుంచి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలలో 9,64354 ఉద్యోగాలు ఖాళీగా ఉన్న ఉన్నాయని గత 45 యేండ్లుగా ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగ రేటు పెరిగిందని.సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ప్రకారం ఏప్రిల్ నాటికి నిరుద్యోగ రేటు 8.11 శాతం నమోదైందని చెప్పడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బిజెపి పాలనను పారద్రోలితేనే అన్ని వర్గాల ప్రజలకు, యువతకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో బిఆర్ఎస్‌వి నాయకులు పయ్యావుల శా య్మ్, ఇరుగంటి రమేష్,దాసరి రమేష్, రాగారం రాములు, గాదగోని సాయిచరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎల్లవేళాల అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలి : సీపీ



సీపీ శ్వేతను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేస్తున్న గౌరారం ఎస్ఐ విజయభాస్కర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లక బదిలీపై వెళ్లిన ఎస్ఐలు బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం సీపీ కార్యాలయంలో సీపీ శ్వేతను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలను అందించారు. గౌరారం ఎస్ఐగా ఎన్. విజయభాస్కర్, మిరుదొడ్డి ఎస్ఐగా వై.నరేష్, భూంపల్లి ఎస్ఐగా ఎ.భువనేశ్వర్, దుబ్బాక ఎస్ఐగా వి.గంగరాజులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేతను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ పోలీసు స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళాల అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

## వర్షాలకు కూలిన ఇండ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



వర్షాలకు కూలిన ఇండ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**వెల్దుర్తి, జూలై28 ప్రభాతవార్త:** గత పది రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పూర్తిగా, పాక్షికంగా ఇళ్లు కూలిపోయాయి. దీంతో శుక్రవారం వెల్దుర్తి గ్రామ పంచాయితీ పరిధిలోని శేరిలాలలో వర్షానికి కూలిపోయిన వడ్డె వెంకమ్మ ఇంటిని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితురాలికి కొంతమేర ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే కూలిన ఇల్లు, ఆమె స్థితిగతులను అడిగి తెలుసు కున్నారు. ఏమైన సమస్య ఉంటే స్థానిక తహశీల్దార్ నాగవర్ధన్‌కు తెలియజేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక తహశీల్దార్ నాగవర్ధన్ ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

**రామచంద్రాపురం, జులై 28, ప్రభాతవార్త:** తెల్లాపూర్ పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ మల్లెపల్లి లలిత సోమిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల నందు చేపట్టే అభివృద్ధి పనులపై సమీక్షించారు. మున్సిపల్‌లో తెల్లాపూర్ బస్ ప్రాంగణం, సిసి రోడ్లు, రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు, మురుగు కాల్వలు, పారిశుద్య పనులపై చర్చించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలని కౌన్సిలర్‌కు ఛైర్మన్ సూచించారు. అభివృద్ధి పనులకు వచ్చే కౌన్సిల్ సమావేశంలో డబ్బులు కేటాయించడం జరుగుతుందని ఛైర్మన్ లలిత సోమిరెడ్డి సభ్యులకు వివరించారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశం దృశ్యం

# పరవళ్లు తొక్కుతున్న ప్రాజెక్టులు

- ఉప్పొంగిన ఉజలంపాడ్ చెరువు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

**నారాయణఖేడ్, సిర్గాపూర్, జులై 28 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాలోనే సిర్గాపూర్ మండలంలో ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు. గత నాలుగు, ఐదు రోజుల నుంచి కురుస్తున్నా ఆకాల వర్షం కారణంగా వరద కొనసాగడంతో ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1493 క్యూసెక్కుల లకు గాను 1493.80 క్యూసెక్కుల నీరు రావడంతో నల్లవాగు అలుగు పారుతుంది. దీంతో ఈ సంవత్సరం రెండు దఫల పంటలు సాగు చేయవచ్చని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురువడంతో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రాజెక్టు పరిసరాల ప్రాంతంలోని కాక చుట్టు పక్కల ప్రజలు కుటుంట సభ్యులతో వచ్చి ప్రాజెక్టు అలుగులను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. అలాగే కొందరు సరదా కోసం చేపలు పట్టి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీరు అలుగు రూపంలో మంజీరా నదిలో కలుస్తుంది. ఏది ఏమైనా వర్షాలు ఆలస్యంగా వచ్చిన గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న ఏడతేరపి లేని వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు పరవళ్లు తొక్కుతున్నాయి. అదే విధంగా మండల పరిధిలోని ఉజలంపాడ్, ప్రాజెక్టులో పూర్తి స్థాయి వరద నీరు చేరడంతో తానేమి తకున్కవ కాదని ఉరకలు పరుగులు తీస్తుంది. అలుగు ద్వారా వరద నీరు దిగువకు ప్రవహిస్తుంది. ఉజలంపాడు, నారాయణఖేడ్ మండల పరిధిలోని గంగాపూర్ ప్రాజెక్టు వద్ద స్థానికులు పరిసరాల ప్రాంతాల ప్రజలు ఉత్స్యకారులు చేపలు పడుతున్నారు. దీంతో రైతులు సైతం జోరుగా వరినాట్లు వేస్తున్నారు. తీరా ప్రాంతాల రైతులు ప్రజలు స్థానికులు నియోజకవర్గంలోని ఆయా ప్రాజెక్టులు నిండటంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాలు కురియడంతో తెలంగాణను అల్లకల్లోలం చేస్తున్నాయి. పలు గ్రామాల ప్రజలు వర్షాలు కురియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో వరి, పత్తి, కూరగాయల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లు తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం వరకు భారీ వర్షం కురియడంతో వాగులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి.





అలుగు పారుతున్న నల్లవాగు, ఉజలం పాడు



పందిల్లలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

## దేవుని దయ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు

### -ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్,జూలై28,ప్రభాతవార్త**

రాష్ట్రంలోనే అతి ఎక్కువ వర్షాపాతం 186.6 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైనా దేవుని దయ వల్ల నియోజకవర్గ వ్యాప్తంగా ఎలాంటి ప్రాణ నష్టం గానీ ఆస్థి నష్టం గాని జరగలేదని ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం రోజున ఎల్లమ్మ చెరువు కట్టతో పాటు చెరువు అలుగు పారుతున్న తీరును నీటి పారుదలశాఖ,మున్సిపల్ అధికారులు,ప్రజాప్రతినిధులతో కలసి పరిశీలించారు.అనంతరం చెరువు కట్ట పక్కనే నిర్మాణ దిశలో ఉన్న డంపింగ్ యార్డు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 660 చెరువులు,కుంటలు ఉంటే అన్ని చెరువులు నిండి మత్తడి పడుతున్నాయని,ఎక్కడా కూడా ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేశారు.ఈ వర్షాల వల్ల హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో లోతట్టు ప్రాంతాలలో ఉన్న ఇండ్లు నీట మునిగిన విషయం తెలుసుకున్న ఆయన వారిని ఇండ్లను సందర్శించి బాదితులను పరామర్శించి లోతట్టు ప్రాంతాలలు,పట్టణంలో శిథిలా వస్థకు చేరిన ఇండ్లలో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలను వెల్లాలని సూచించారు. అనంతరం మండలంలోని పందిల్ల గ్రామంలో గల రొడ్డాం వద్ద ఎల్లమ్మ చెరువు మత్తడి బారీగా పడడంతో రొడ్డాం పై నుండి నీటి ప్రవాహం పెరిగి ఎన్నడూ లేని విధంగా హుస్నాబాద్ నుండి సిద్దిపేట ప్రధాన రహాదారిపై ఒక మీటరు ఎత్తులో ప్రవాహించడ ం పట్ల సంతోషం వ్యక్తం చేసి ఈ రోడ్డు ను పరిశీలించారు.కురిసన భారీ వర్షాల వల్ల గ్రామాలతో పాటు హుస్నాబాద్ పట్టణంలో ఎలాంటి నష్టం జరగకుండా చూసిన అధికారులు,ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు తీసుకోవడం పట్ల వారిని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, ఎంపిపి లకావత్ మానససుభాష్, వైస్‌చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, అక్కన్నపేట ఎంపిపి మాలోతు లక్ష్మిభీలునాయక్, బిఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్,మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# అస్వస్థకు మిషన్ భగీరథ నీరే కారణమా! మరేదైన కారణమా?

## మూడు గ్రామాల్లోనే అస్వస్థకు ఎందుకు గురయ్యారు?



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

**దుబ్బాక, జులై 28, ప్రభాతవార్త:** దుబ్బాక మండల పరిధిలోని బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, నర్లేన్‌గడ్డ, పూరపాలిక పరిధిలోని దుంపలపల్లి వార్డుకు చెందిన సుమారుగా 80 మందికి పైగా ప్రజలు తీవ్ర వాంతులు, విరోచనాలతో అస్వస్థకు గురై దుబ్బాక పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రెండు ప్రైవేట్ ఆసుపత్రిలో గురువారం చేరికైనారు. బాధితుల్లో సీరియస్‌గా ఉన్న 8 మందిని సిద్దిపేటలోని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఇద్దరు అస్వస్థతో శుక్రవారం మృతి చెందడం జరిగింది. మిగిత వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మేరుగైన వైద్య అందిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. బాధితుల రక్త, మూత్ర నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపడం జరిగిందని మరో రెండు రోజుల్లో ఫలితాలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. కొంత మంది మిషన్‌భగిరథ నీటిని త్రాగడం, మరికొంత మంది చెపలు తినడం, కళ్ళు సేవించడం వల్ల అస్వస్థకు గురైనట్లు బాధిలు చెబుతున్నారు. అయితే అస్వస్థకు గురైన బాధితోల్లో అత్యధికులు కళ్ళు సేవించిన వారే కావడం గమనార్హం. ఈ అస్వస్థకు ఒక వేల మిషన్ భగీరథ నీరే కారణం అనుకుంటే ఈ గ్రామాలతో పాటుగా అన్ని గ్రామాల్లోకి నిత్యం భగీరథ నీరు వెల్లడం జరుగుతుందని అన్ని గ్రామల్లో కాకుండా కేవలం బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, నర్లేన్‌గడ్డ, పూరపాలిక పరిధిలోని దుంపలపల్లి వార్డులోనే ఎందుకు ఇంత మంది అస్వస్థకు గురైనారు అనే అనుమానాలు కొంత మందిలో వెల్లు వెత్తున్నాయి. ఏది ఏమైన ఈ మూడు గ్రామాల్లో జరిగిన ఇంతటి అస్వస్థకు గురికావడం పట్ల ఎవరు బాధ్యత వహిస్తారో చూడాలి.

### ఎమ్మెల్యే రఘునందన్ రావు పరామర్శ



బాధిత కుటుంబాలతో మాట్లడుతున్న ఎమ్మెల్యే

దుబ్బాక మండలంలో పద్మశాలిగడ్డ గ్రామంలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురై సుంగూరి కుంటయ్య, కూటిగంటి రాజవ్వ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి నివాళ్ళులు ఆర్పించారు. అనంతరం అత్యక్రియలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట బిజెపి నాయకులు అంబాటి బాలేష్ గౌడ్, చింత సంతోష్, దూలం వెంకట్ గౌడ్, బిక్షపతి, పుట్ట వంశీ, మచ్చ శ్రీనివాసు, తోగుట రవీందర్, సుంకు ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

### ప్రత్యేక హెల్ క్యాంపులను సందర్శించిన ఎమ్మెల్యే

దుబ్బాక మండలంలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన గ్రామల్లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకుని దుబ్బాక మండలంలోని బల్వంతాపూర్, నరెండ్ల గడ్డ, పద్మశాలి గడ్డ, దుబ్బాక మున్సిపాలిటి పరిధిలో పెద్దగుండవెల్లి గ్రామల్లో అధికరులు నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులను ఎమ్మెల్యే రఘనందన్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు అధికారులతో మాట్లాడి ప్రజలకు మెరుగైన వైద్య అందించాలని సూచించారు.వీరితో తిమ్మాపూర్ వైద్యాధికారిని డాక్టర్ భార్గవి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, అయా గ్రామాల సర్పంచులు, నాయకులు, అధికారులు ఉన్నారు.

## గిరిజనుల మధ్య చిచ్చుపెడితే సహించేది లేదు

### ఎంపి సోయం బాబురావు దిష్టిబొమ్మ దహనం



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద బిజెపి ఎంపి సోయం బాబురావు దిష్టిబొమ్మను దగ్దం చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

**పుల్కల్, జులై 28, ప్రభాతవార్త:** రాజ్యాంగ బద్ధంగా ఎస్టీలుగా గుర్తించిన లంబా డీలను ఎస్టీ జాబితా నుంచి తీసివేయాలని అదిలాబాద్ బిజెపి ఎంపి సోయం బాబురావు చేసిన వాఖ్యలను నిరసిస్తూ గిరిజన సంఘాల నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఎంపి సోయం బాబురావు శవయాత్రను నిర్వహించి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు రాజేందర్‌నాయక్, ఉద్యోగ సంఘాల నా యకులు మాంజ్య నాయక్, సుభాన్‌సింగ్‌లు మాట్లాడుతూ గిరిజన మధ్య చిచ్చుపెడితే ఖబర్దార్ అని హెచ్చరించారు. సోయం బాబురావుపై పిడి యాక్టు పెట్టాలని, ఎంపి సభ్యత్వాన్ని రద్దు చేయాలని, రాజద్రోహం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.నాగలగిద్ద జడ్పీటిసి సభ్యులు రాజు రాథోడ్, గిరిజన సంఘాల నాయకులు, సర్పంచ్‌లు రగ్య నాయక్, రంజిల్, చందర్, తారసింగ్, పరశురాం, రవి, రఘు, వినోద్, శ్రీనివాస్, శంకర్ నాయక్, ప్రకాష్ నాయక్, జైపాల్, డాక్టర్ హరి, శివాజీ, శ్రీను, గోపాల, గౌషాబాద్ రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మణిపూర్ ఘటనను సహించేది లేదు

**నారాయణఖేడ్, జులై 28 ప్రభాతవార్త:** మణిపూర్‌లో ఎంపీ సోయాం బాపురావు చేసిన ఘటనపై తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐబిఈఎస్ఎస్ ఆల్ ఇండియా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ సభ్యులు తీవ్రంగా ఖండి స్తున్నామని నారాయణఖేడ్ డివిజన్ కమిటీ బాధ్యులు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షులు మేఘ్యానాయక్ తదితరులు మాట్లాడుతూ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వ్యాఖ్యానించిన భాజపా ఎంపీసోయం బాబురావును వెంటనే సస్పెండ్ చే యాలని వారన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.హరిసింగ్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు జీవన్ రాథోడ్, డివిజన్ ఉపాధ్యక్షులు గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్, బాబురావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

# ఎమ్మెల్యే వల్లే పార్టీకి దూరమవుతున్నా

- -ఎంటెక్ చదివి సాఫ్ట్‌వేర్ జాబ్ వదలి ప్రజా సేవకై అంకితమయ్యా
- -దేవేందర్‌రెడ్డి ఆగడాలు మితిమీరాయి
- -నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్

**మెదక్ రూరల్, జూలై28 ప్రభాతవార్త:** ఎన్నో అవమానాలు, వివక్షకు గురై పార్టీని వీడవలసి వస్తుందని, సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, తనకు రాజకీయ భిక్ష పెట్టింది మంత్రి హరీశ్‌రావు అని, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తాను బీసీనని తనను అణగదొక్కాలని చూస్తున్నారని నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం మెదక్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంటెక్ చదివి సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తూ లక్షల్లో జీతం తీసుకోవడం వల్ల ఉపయోగడం లేదని ప్రజా సేవయే లక్ష్యంగా పనిచేయాలనే ఉద్దేశంతో మంత్రి హరీశ్‌రావు ప్రోద్భలంతో రాజకీయ జీవితం ప్రారంభించానని, స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విధి విధానాలు, భర్త దేవేందర్‌రెడ్డి పెత్తనం పోకడలతో తాను ఈ నాలుగు సంవత్సరాలలో మనస్సు ఎంతో క్షోభ చెందిందని, తల్లి లాంటి పార్టీని వదిలి పెట్టడానికి మనసొప్పలేదని, అయినా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పోరాడకం తప్పడం లేదని అన్నారు. రామాయంపేట డివిజన్ విషయంలో తాను మంత్రి దగ్గర స్పష్టమైన హామీ తీసుకున్నానని, ఇప్పుడు ఉన్న డివిజన్లకు కొత్తగా రాష్ట్ర వ్యాప్తంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేసేదుంటే మొదలు రామాయంపేట ఉంటుందని అన్నారని, ఇప్పటికీ పది డివిజన్లు ఏర్పాటైన అందులో రామాయంపేట ఊసు ఎత్తలేదన్నారు. ఒకసారి సాంక్షన్ అయిన మెడికల్ కాలేజీ గురించి మూడు సార్లు కేసీఆర్‌కు పాలాభిషేకం చేయడం, నిజాంపేట పీహెచ్‌సీ సెంటర్ సాంక్షన్ కాకున్నా అక్కడ ప్రారంభోత్సవానికి కొబ్బరి కాయ కొట్టడం, నార్లాపూర్ గ్రామంలో అత్యవసరంగా రాత్రికి రాత్రే గ్రామ పంచాయితీ భవనాన్ని కూలదోసి ప్రారంభోత్సవానికి కొబ్బరికాయ కొట్టడం, రాంపూర్, నస్కల్, నిజాంపేట రోడ్లను బాగు పరచాలని ఎన్నో సార్లు విన్నవించినా పట్టించుకోవకపోవడం, అదే రాంపూర్ నుండి మెదక్కు పాదయాత్ర చేస్తామన్నప్పుడు మంత్రి హరీశ్‌రావు ద్వారా ఆ విషయాన్ని దాట వేయించడం, రాష్ట్ర స్థాయిలో సర్పంచులందరూ నానా నరకయాతన పడుతున్నారన్నారు. ఏవైనా ప్రజా సమస్యలపై స్వంత పార్టీ నేతలు గళమెత్తితే వారిని ఆర్థికంగా దెబ్బతీయడం, అవతలి పార్టీల వారు నోరు విప్పితే కేసులు పెడుతున్నారన్నారు. నిజాంపేట మండలంలో కొత్త భనాలు నిర్మిస్తానని చెప్పి, అద్దె భవనాలు కూడా కిరాయిలు చెల్లించకుండా కాలం వెల్లదీస్తున్నారని తెలిపారు. మెదక్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపిస్తే జిల్లా కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తానని ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రకటించిన హామీని ఇప్పటి వరకు గుర్తు చేయకపోవడం, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆసుపత్రికి కమిటీకి ఛైర్మన్‌గా ఉంటారని, అదే మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు అలాంటి కమిటీ ఉన్నట్లు దాఖలాలు లేవన్నారు. ఆసుపత్రికి వచ్చిన నిధులు ఏమైపోతున్నాయోనని, ఆసుపత్రిలో పనిచేస్తున్న వారి సంఖ్య, ఆసుపత్రికి గణాంకాలు అన్ని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి భర్త దేవేందర్‌రెడ్డి కనుసన్నల్లో నడుస్తున్నాయన్నారు. ఆసుపత్రి సూపరింటిండెంట్ చంద్రశేఖరన ఏళ్ల తరబడి ఇక్కడే తిష్ట వేసుకున్నా ఆయనను అడిగే నాధుడే లేడన్నారు. విద్య, వైద్యంపై జెడ్పీ సమావేశంలో ప్రతిసారి గళం విప్పే సభ్యుడిని నేనేనని గుర్తు చేశారు. సోషల్ మీడియా ద్వారా తన అనుచరులను ఇబ్బంది పెడుతూ పోలీసులతో స్వంత పార్టీ నేతలతో కేసులు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. నిబద్ధత గల ప్రజా నేతగా బాధ్యతగా నిజాంపేట మండల ప్రజల ఆవేదనను తాను ఈ వేదిక ద్వారా తెలియజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఈ సమస్యలన్నింటికీ కారణమైన నేతలను తనతో ఏకీభించే వారితో కార్యాచరణ రూపొందించి ప్రజాక్షేత్రంలో వందల మంది నేతలతో ఎదుర్కుంటామన్నారు.

## కురుస్తున్న వర్షాలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**తాండూరు టౌన్ జూలై28,ప్రభాతవార్త :**
గత వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలతో తాండూరు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిజెపి తాండూరు పట్టణ శాఖ అధ్యక్షుడు గోరేపల్లి సుదర్శన్ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ....తాండూరు నియోజకవర్గంలో వాగులు,కుంటలు,మురికి కాలువలు పొంగిపొర్లతూ పలు కాలనీలోకి నీరు చేరుకుంటున్నాయని వీటివల్ల ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పలు కాలనీలోని రోడ్లు అస్తవ్యస్తంగా మారి ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని కావున వెంటనే సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మున్సిపల్ శాఖ,రోడ్ల భవనాల శాఖ,పోలీస్ శాఖ, ఆరోగ్యశాఖ ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి తగ్గు చర్యలు వెంటనే తీసుకోవాలని సూచించారు.అంటు వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో ఆరోగ్యశాఖ వారు ఇంటింటికి వెళ్లి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే,సంబంధిత శాఖలకు వెంటనే ఆదేశాలు జారీ చేసి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా నిదులు కేటాయించాలని బిజెపి తాండూర్ పట్టణ శాఖ అధ్యక్షుడు గోరేపల్లి సుందర్శన్ గౌడ్ డిమాండ్ చేశారు.

## మొహరం పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**-పురపాలక చైర్మన్ ముకుంద అశోక్ కుమార్**


మొహరం ఏర్పాట్ల పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అశోక్ కుమార్

**పరిగి జూలై28,ప్రభాతవార్త :**
మొహరం పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని పురపాలక చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ పేర్కొన్నారు.శుక్రవారం పరిగి పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డులో మొహరం పండుగ ఏర్పాట్లును చైర్మన్ ముకుంద అశోక్ కుమార్,కౌన్సిలర్ బొంబాయి నాగేశ్వర్ పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ....హిందూ ముస్లింల మతసామరస్యానికి ప్రతికగా జరుపుకునే మొహరం పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.కాలనీలో అక్కడక్కడ గుంతలుగా ఏర్పడిన పలుచోట్ల డస్ట్ పోయించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గౌస్ పాషా,గౌస్ ఉద్దీన్,ఏజాజ్,యూసఫ్,ఆయా కాలనీవాసులు,పారిశుధ్య కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో బిజెపి ధర్నా


వరద నీటిలో ధర్నా చేస్తున్న బిజెపి నాయకులు

**బోడుప్పల్, జులై 28 (ప్రభాతవార్త) :**
ప్రజలు వరద నీటిలో మునుగుతుంటే అధికార బిఆర్ఎస్ పార్టీ నాయకులు పట్టించుకోవడంలేదని ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఉదయం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి పరిధిలోని ఆర్టీసి కాలనీలో ముంపుకు గురైన ప్రాంతాన్ని స్థానిక బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. పార్టీ నాయకులు, స్థానికులతో కలిసి వరద నీటిలో ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని అధికారులకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బిఆర్ఎస్ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న వరద సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అనిల్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ గ్రామంలో పశువైద్య శిబిరం
### (వార్తకు స్పందన)


లేగ దూడకు టీకా వేస్తున్న డాక్టర్ స్వర్ణలత రెడ్డి

**ధారుర్ జూలై28,ప్రభాతవార్త :**
గురువారం వార్త పత్రికలో గుర్తు తెలియని వ్యాధులతో మూగ జీవుల మృత్యువాత అనే శీర్షికన ప్రచురితమైన కథనాన్ని పశువైద్య ఉన్నత అధికారులు తక్షణమే స్పందించారు.ఈ మేరకు మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో పశు వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు.గ్రామంలో పూర్తిస్థాయిలో లేగ దూడలను పరిశీలించి తగు వైద్యం చేశారు.దీంతో రైతులు పశువైద్యాధికారులపై కరశం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి డాక్టర్ స్వర్ణలతారెడ్డి,అనంతయ్య,గోపాల్ ఉన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

**షాబాద్, జూలై 28, ప్రభాతవార్త :**
కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఆస్పల్లిగూడ గ్రామానికి చెందని కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గొల్ల రాములు అమ్మ గొల్ల మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, గ్రామసర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మాజీసర్పంచ్ ఆంజనేయులుగౌడ్, గ్రామస్థులు సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, మురళి ఉన్నారు.

## నూతన భవనంలోకి ఎపిజివిబి బ్యాంకు

**బొంరాస్‌పేట్, జూలై28,ప్రభాతవార్త :** దుద్యాల మండల పరిదిలోని హకీంపేట్ గ్రామంలో ప్రజలకు సేవలు అందిస్తున్న ఎపిజివిబి బ్యాంకును శుక్రవారం రిజినల్ మేనేజర్ సుభాష్,రవికిషోర్ అధ్వర్యంలో పాతభవనం నుండి నూతనంగా నిర్మించిన భవనంలోకి ప్రత్యేక పూజలు నిర్వహించి మార్చడం జరిగిందని బ్యాంకు మేనేజర్ మేర్య తెలిపారు.తమ శాఖయందు కొత్త బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయడం,గోల్డ్ లోన్స్,వ్యవసాయ రుణాలు,గృహరుణాలు,ఇన్సురేన్స్ వంటి సేవలను అందించడం జరుగుతుందని ఖాతాదారులు,ప్రజలు ఈ అవకాశంను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మేర్య,బ్యాంకు సిబ్బంది రవికాంత్,హరిష్‌కుమార్, రాంబాబు,గజేంద్ర,ఖాతాదారులుపాల్గోన్నారు.

# వర్షాధార పంటలల్లో మురుగునీరు తీసివేయాలి



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
జిల్లాలో చాలా చోట్ల మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసన ప్రాంతాలలో వర్షాధార పంటలైన పత్తి,కంది,మొక్కజోన్న మరియు సోయా చిక్కుడు నుండి మురుగు నీటిని తీసివేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తరువాత పత్తి పంటకు ఎకరాకు 25 కిలోల యూరియా మరియు 20 కిలోల పొటాష్‌ను పైపాటుగా 20 రోజుల వయస్సున్న పంటకు మొక్కల మొదళ్లలో 7-10 సెం.మీ ధూరంలో పాదులు తీసి ఎరువులను వేసి మట్టితో కప్పవలెనని తెలిపారు.పంట త్వరగా కొలుకోవడానికి 19 : 19: 19 లేదా 10(గ్రామ,మల్టీ -కె (13-0-45 )లేదా 20 గ్రా,యూరియా లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవదిలో రెండు సార్లు పిచికారి చేయాలని ,చీడపీడల ఉధృతి పెరగకుండా 2.5 గ్రామ.కార్బెండజీమ్ ప్లస్ మాంకోజెబ్ లేదా 2 మి.లి పిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని ఆయన సూచించారు.అధిక వర్షాలు మరియు ఆకాశం మేఘవృత్తంమై ఉండడం వలన పత్తిలో వడలు తెగులు,సోకుటకు అవకాశం ఉన్నందున,నివారణకు 3 గ్రా.కాపర్ -ఆక్సీ -క్లోరైడ్ మందును ఒక లీటర్ నీటికి కలిపి మొక్క మొదళ్ల చుట్టూ తడపవలేనని అన్నారు.

**కంది :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో కంది ఫైటోప్తోరా ఎండు తెగులు ఆశంచడానికి అనకూలం,తెగులు,గమనించినచో నివారణకు 3 గ్రామ,కాపర్ -ఆక్సీ - క్లోరైడ్ మందును ఒక లీటర్ నీటికి కలిపి మొక్క మొదళ్ల చుట్టూ తడపవలేనని,వర్షాలు ఆగిన తర్వాత,నేలలో పైపాటుగా ఎరువులు వేయలేని పక్షంలో 20 గ్రామ,యూరియా లేదా 10 గ్రామ.మల్టీ-కె (13 -0-45 ) మందన ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.
మొక్కజోన్న పంట లేత దశలో తేమకు చాలా సున్నితం మరియు అధిక నీటి నిలువను తట్టుకోలేదు.కావున పొలం నుండి మురుగు నీటిని వీలైనంత త్వరగా తీసివేయాలని,ఈ సమయంలో అధిక తేమ వలన భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఉదా రంగులోకి మారే అవకాశం ఉంటుంది.కావున వర్షాలు నిలిచిన తర్వాత 5 గ్రా,19-19-19 లేదా 20 గ్రా.డిఏపి మందును లీటర్ నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేయాలి వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత ఎకరాకు 30 కిలోల యూరియా మరియు 15 కిలోల పొటాష్‌ను వేసుకోవాలని అన్నారు.తక్కువ కాల పరిమితి గల మొక్కజోన్న రకాలను జూలై31వరకు విత్తుకొవచ్చని సూచించారు.
సోయాచిక్కుడు పంటలో ఆకుమచ్చ తెగులు కాండం కుళ్లు తెగులు గమ నించిన ట్లైతే 2.5 గ్రా.కార్బెండజీమ్ ప్లస్ మాంకోజెబ్ లేదా 2 మిలి పిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు.
వరి ఇప్పటి వరకు నార్లు పోయని రైతాంగం వర్షాలను సద్వినియోగం చేసుకొని పొలాలను దమ్ము చేసి వరి పంటను నేరుగా విత్తే పద్దతిలో విత్తుకోవడం వలన సమయం మరియు పెట్టుబడి ఆదా చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారి రైతులకు తెలియజేశారు.

# రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తే తక్కువ వడ్డీ పడుతుంది

**-డ్వాక్రా మహిళలకు 15 కోట్ల రుపాయల రుణాలు మంజూరు**
**-ఎస్‌బిఐ తెలంగాణ చీఫ్ జనరల్ మెనేజర్ రాజేష్ కుమూర్ వెల్లడి**


-చేవెళ్లలో డ్వాక్రా మహిళను మెమెంటోతో సత్కరిస్తున్న ఎస్‌బిఐ తెలంగాణ చీఫ్ జనరల్ మెనేజర్ రాజేష్ కుమూర్

**చేవెళ్ల, జూలై 28, ప్రభాతవార్త**
రైతులు సకాలంలో రుణాలను చెల్లిస్తే తక్కువ వడ్డీతో పాటు అనేక ప్రయోజనాలు న్నాయని ఎస్‌బిఐ తెలంగాణ చీఫ్ జనరల్ మెనేజర్ రాజేష్ కుమూర్ అన్నారు. ఎస్‌బిఐ చేవెళ్ల శాఖ అద్వర్యంలో సంద్యా శిభిరంలలో బాగాంగా రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్‌బిఐ తెలంగాణ చీఫ్ జనరల్ మెనేజర్ రాజేష్ కుమూర్ మాట్లాడుతూ రైతులకు నిరంతరం సేవలు అందించేందుకు ఎస్‌బిఐ బ్యాంకులు ముందున్నాయన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లిస్తే తక్కువ వడ్డిపడుతుందన్నారు. సకాలంలో రుణాలను చెల్లించకుంటే ఎక్కవ వడ్డిపడుతుందన్నారు. రైతులకు పెట్టుబడులను రుణాలను అందించేందుకు ఎస్‌బిఐ బ్యాంకు అధికారులు సిద్దంగా ఉన్నారన్నారు. బ్యాంకులో రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లించడంను రైతులు అలవాటు చేసుకోవాలన్నారు. రైతులు తతీసుకున్న పంట రుణాలు తీసుకుని చెల్లిస్తే అనేక ప్రయోజనాలను బ్యాంకు అందిస్తున్నారు.బ్యాంకుకు వస్తున్న కస్టమర్‌ల సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రైతులతో పాటు మహిళ సంఘాలకు కూడ రుణాలు అందిస్తున్నారు. డ్వాక్రా మహిళలు రుణాలు తీసుకోవడం వ్యాపారం చేయడంతో పాటు తిరిగి సకాలంలోచెల్లిస్తున్నారన్నారు.చేవెళ్ల మండంలోని మహిళ గ్రూపు సభ్యులకు సుమారు 15 కోట్ల రూపాయలను రుణాలను మంజూరు చేశామన్నారు.రుణాల చెక్కును మహిళ సభ్యులకు అందజేశారు.మహిళలకు బ్యాంకులో రుణాల తీసుకోవడం తిరిగి చెల్లిస్తున్నందున వడ్డిలో రాయితీ లబిస్తుందన్నారు.రైతులకు వ్యవసాయ రుణాలతోపాటు అన్ని రుణాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డిజిఎం బాలనంద్, డిజిఎం ఎబియు ఐనోస్ కుమార్, సిన్హ్ వికారాబాద్ ఎజిఎం మదుబాబు, రంగారెడ్డి జిల్లా డిపిడిఓ ప్రభాకర్, డిపిఎం బాలరాజుగౌడ్, చేవెళ్ల మండల వ్యవసాయ శాఖ అధికారి తులసి, న్యాలట గ్రామ సర్పంచ్ లక్ష్మీ, ఎస్‌బిఐ చేవెళ్ల శాఖ మేనేజర్ సంధ్యారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్‌ఉమార్,సర్వీసేట్ మేనేజర్ కమల,బ్యాంకు సిబ్బంది సనాఆఫ్రీన్, సాయిప్రణీత్, సూధాకర్,వెంకట్, సత్తిరెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గోన్నారు.

## పారిశుధ్య కార్మికుల డిమాండ్‌లను నేరవేర్చాలి



**చౌడపూర్ జూలై28,ప్రభాతవార్త :**
మండల కేంద్రంలో వివిధ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల ఆధ్వర్యంలో తమ డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని భిక్షాటన చేస్తూ నిరసన చేపట్టారు.ప్రతి గ్రామ పంచాయతీలో పరిశుభ్రత కొరకు నిరంతరంగా శ్రమిస్తూ ఉన్న పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జీవో 51 ను సవరించి మల్టీపర్పస్ హైర్ విధానాన్ని రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు.కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని పిఎఫ్,ఈఎస్ఐ అందించాలని,పంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరణ చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు.ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిసేనత బాధిత కుటుంబానికి 10లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు.తమ సమస్యలను పరిష్కరించే వరకు విధుల్లో చేరబోమని స్పష్టం చేశారు.కార్మిక సంఘాల అధ్యక్షుడు యాదయ్య,గౌరవ అధ్యక్షుడు హనుమంతు,ప్రధాన కార్యదర్శి రాములు,ఉపాధ్యక్షుడు దండు వెంకటయ్య,కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఆనంద్,బోయిని నరేష్,రామ్ చందర్, వివిధ గ్రామాల పంచాయతీ పారిశుధ్య కార్మికులు,సిబ్బంది,నిరసనలో పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరగకుండా చూడాలి

**-ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**


భారీ వర్షాలతో పాడైన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

**ధారుర్ జూలై28,ప్రభాతవార్త**
భారీ వర్షాలతో ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదేశించారు.శుక్రవార మండల పరిధిలోని ఏబ్బనూరు, చెరువు కోటపల్లి ప్రాజెక్ట్,వాగులను వర్షాలకు పాడైన పంటలను,విద్యుత్ స్తంభాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.... కురుస్తున్న వర్షాలతో ప్రమాదాలు పొంచి ఉన్నందున ప్రజలు ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండాలన్నారు.ప్రాణహాని కలిగించే విద్యుత్ తీగలు,స్తంబాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశించారు.వరదల ప్రవాహానికి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి,ప్రధాన కార్యదరిశ రాజు గుప్తా, అంజయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ సంతోష్,సర్పంచ్ సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,రైతుబంధు అధ్యక్షుడు రుద్రారం వెంకటయ్య,రహమతుల్లా ఖాన్,కావాలి అంజయ్య,మొయిజ్ కురేశి,చెన్నయ్య గౌడ్,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లు కోల్పోయిన పేద ప్రజలను పట్టించుకోరా : వీర్లపల్లి శంకర్


ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**షాద్‌నగర్, జూలై 28, (ప్రభాతవార్త) :**
నియోజకవర్గంలో గత వారం పది రోజులుగా నిరంతరయంగా వర్షాలు కురుస్తుండటంతో ఎంతో మంది పేద ప్రజలు తమ ఇండ్లను కోల్పోతున్నారని, వారి ఇండ్లు కూలిపోయి దీనావస్థ స్థితిలో పేద ప్రజలు ఉంటే వారిని పట్టించుకోరా అంటూ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అధికారులు, ప్రజాప్రతినిధుల తీరును ప్రశ్నించారు. ఇండ్లు కూలిపోయిన బాధితులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ తదితర కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు పడుతున్నాయని, నియోజకవర్గంలో చాలా మంది ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లు కోల్పోయిన బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతకాల్సిన పరిస్థితి నెలకొందని, అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు అటు వైపు చూడటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యాటించకపోవడం విడ్డురంగా ఉందని, పేదలు కష్టాలు పడుతుంటే తమకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. నిలువ నీడ లేక ఆదుకునే వారు లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారని వారి పరిస్థితి ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేద ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించి సకాలంలో ఇచ్చి ఉంటే నేడు వారికి ఈ తిప్పలు ఉండేవి కావని ఆయన ఎద్దేవా చేశారు. రైతన్నలు సహితం తీవ్రంగా నష్టపోయారని, నియోజకవర్గ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించి ప్రభుత్వానికి వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బాబర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఫరూఖ్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మునావర్, ఖాదీర్, లింగారెడ్డిగూడ ఆశోక్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి హరీష్ గౌతమ్‌కు సన్మానం



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
తాండూరు పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్ నందు 2022-23 గడిచిన విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థి హరీష్ గౌతమ్‌కు సోషల్ సబ్జెక్టులో మార్కులు తక్కువ రాగా రీ వెరిఫికేషన్ పెట్టించడంతో 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించాడని పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ మదార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి హరీష్ గౌతమ్‌ను సన్మానించారు.10/10 పాయింట్లు సాధించిన హరీష్ గౌతమ్‌ను శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్,డైరెకర్ శ్రీవిద్య,డిజిఎం సుధాకర్,ఆర్ఐ రఘు,అకాడమిక్ కోఆర్డినేటర్ వీరస్వామిలు అభినందించారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యారాణి, లక్ష్మీకాంతరావు,ఏవో రవీందర్ రెడ్డి,డిన్ శివరాం,సి బ్యాచ్ ఇన్‌చార్జీ అనన్య,ప్రైమరీ ఇన్‌చార్జీ భవ్య ,ప్రిప్రైమరీ ఇన్‌చార్జీ అనిత,ఉపాధ్యాయులు సంజీవ,విజయ కుమార్, షబ్బీర్,పద్మ,వెంకటేష్,బాలవర్ధన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## పీర్లను దర్శించుకున్న మున్సిపల్ కౌన్సిలర్


పీర్లను దర్శించుకున్న మున్సిపల్ కౌన్సిలర్

**కొడంగల్,జూలై 28ప్రభాతవార్త**
హింధు,ముస్లీం సోదరులు సోదర భావంతో జరుపుకునే పీర్లను మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్ దరి ్శంచుకున్నారు.మొహరం వేడుకల్లో భాగంగా పట్టణంలోని ఆర్యనగర్ ప్రాంతంలో ప్రతిష్టించిన పీర్లను పట్టణ మాజీ సర్పంచ్ ఎస్.ఎం.గౌసన్‌తో కలసి దర్శించుకున్నారు.అనంతరం పీర్లకు ప్రత్యేక ప్రార్దనలతో దట్టీలు సమర్పించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు కుల మతాలకతీతంగా పట్టణ ప్రజలు మొహరం పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

## మహిళ అదృశ్యం

**బషీరాబాద్,జూలై 28,ప్రభాతవార్త:** ఓ మహిళా అదృశ్యమైన సంఘటన బషీరాబాద్ మండల పరిధిలోని కాశీంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. బషీరాబాద్ ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గొట్టిగా శ్రీనివాస్ కు లావణ్య తో మూడు సంవత్సరాల క్రితం వివహమైంది. కాగా ఈ నెల 15వ తేదీన రాత్రి తనతో కలిసి ఉన్న తన భార్య 16వ తేదీన తెల్లవారుజామున లేచి చూడగా కనిపించలేదని తమ బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించకపోవటంతో ఈ నెల 28వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

## అస్తమించిన తెలంగాణ ఉద్యమకారుడు


తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు,జెఎస్సి జిల్లా మాజి చైర్మెన్ వెదిరె చల్మారెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సబితారెడ్డి.

**ఇబ్రహీంపట్నం, జులై 28, ప్రభాతవార్త:**
తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు,జెఎస్సి జిల్లా మాజి చైర్మెన్ వెదిరె చల్మారెడ్డి కన్ను మూశారు.మంచాల మండలం,ఆరుట్ల గ్రామానికి చెందిన ఆయన కొంత కాలంగా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ, రాగన్నగూడ లక్ష్మి వెగాటౌన్ షిప్‌లో నివాసముంటున్నారు.గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారు.మంత్రి సబితారెడ్డి,జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి,టిజెఎస్ అధ్యక్షులు కోదండరాం,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి,తో పాటు పలువురు నాయకులు ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాడ సంతాపం ప్రకటించారు.అంత్యక్రియలు రాగన్నగూడ స్మశాన వాటికలో జరిగాయి.ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో సహచర ఉద్యకారులు అంబేద్కర్ చౌరస్తాలో చల్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.నివాళులర్పించిన వారిలో డబ్బికర్ శ్రీనివాస్, బర్ల జగదీశ్వర్ యాదవ్,గాజుల గోపాల్,రాజు, శేఖర్,శ్రీను, నర్సింహ,గణేష్ తదితరులున్నారు.

## పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాఖ ఏడీఏ శంకర్‌రాథోడ్


నీటూర్‌లో పంట పొలంలో రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్న శంకర్‌రాథోడ్

**దౌల్తాబాద్, జులై 28 ప్రభాతవార్త :**
మండల పరిధిలోని నీటూర్ గ్రామంలో రైతుల పంట పొలాలను వ్యవసాయ శాఖ కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ శుక్రవారం పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో పంట పొలాల్లో నీరు నిలిచి ఉండటంతో రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వర్షాలు తగ్గిన తర్వాత పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు సూచనలు చేశారు. పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించి కాపర్ ఆక్సీ క్లోరైడ్ పూయాలని తెలిపారు. అదే విధంగా రైతులు యూరియా, పోటాష్‌ను వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు వేయాలన్నారు. అనంతరం 15 సర్వే నెంబర్లను స్వయంగా సందర్శించి క్రాప్ బుకింగ్ చేశారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీపతిరెడ్డి, వీఆర్ఏ సిద్దప్ప, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో హైమాస్ లైట్ల ఏర్పాటు


చిన్ననందిగామలో హైమాస్ లైట్లను ప్రారంబిస్తున్న సర్పంచ్

**కొడంగల్,జూలై 28ప్రభాతవార్త**
మండల పరిధిలోని చిన్ననందిగామ గ్రామంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో హైమాస్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామసర్పంచ్ సావిత్రమ్మసాయిలు తెలిపారు.ఈ మేరకు మంజూరైన హైమాస్ లైట్లను శు క్రవారం గ్రామ పెద్దల సమక్షంలో ప్రారంబించారు.ఈ సందర్భంగా అమె మాట్లాడుతు గ్రామానికి హైమాస్ లైట్లు మంజూరీ చేయాలని కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే హైమాస్ లైట్లను మంజూరీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు .కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వినోద్‌కుమార్,సాయిలు,ఉపసర్పంచ్ అంజి, వార్డు సభ్యులు మక్బుల్,మల్కమ్మ,నర్సమ్మ, సావిత్రమ్మ,అబ్దులప్ప, జి.రాములు,వీరారెడ్డి,మొగులప్ప,సురేష్‌లతో పాటు భారత్ ,మైహేందర్,వెంకట్, విజప్ప, వెంకటప్ప,భీమయ్య,నరేష్,అశోక్,భీమప్ప,సాయప్ప,లింగప్ప,ఆశప్ప,కిష్టప్ప,ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

**షాబాద్, జూలై 28, ప్రభాతవార్త :**
రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశం అన్నారు. మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఫర్టిలైజర్ షాపును శుక్రవారం వ్యవసాయాధికారి వెంకటేశం, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏవో వెంకటేశం మాట్లాడుతూ....రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.... గత సంవత్సరం ఏర్పాటైన సంఘం, ఇప్పుడు సభ్యులు పెరిగారన్నారు. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, జాతీయ పరిశోధన సంస్థల భాగస్వామ్యంతో చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అదేవిధంగా పంటలలో మేలైన యాజమాన్య పద్దతులు అధిక దిగుబడులకు పాటించాల్సిన మెళుకువలు, ఆధునిక వ్యవసాయ పనిముట్లు గురించి వివిధ పంటల్లో వచ్చే చీడ, పీడల నివారణ సేంద్రీయ ఎరువుల తయారీ గురించి రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ జయమ్మసుదర్శన్, సంఘం డైరెక్టర్లు లింగం, గోపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, మల్లారెడ్డి, అంజయ్య, మాజీ ఎంపీపీ వెంకటయ్య, మాజీ సర్పంచ్ భూపతిరాజు, ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి, రైతులు కమలాకర్‌రెడ్డి, పర్వేద నర్సింలు, బొబ్బిలిగామ, తిర్మలాపూర్, రేగడిదోస్వాడ, మామిడిపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

**తొగుట, జులై 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుడికందుల గ్రామంలో శుక్రవారం లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సర్పంచ్ గంగనిగల్ల మల్లయ్యతో కలిసి పిఎసిఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరి కృష్ణరెడ్డి అందజేశారు. సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదన్నారు. గ్రామానికి చెందిన పులి స్రవంతికి రూ.24 వేలు, అల్లిమెల్లి జనార్ధన్‌కు రూ.13 వేలు చొప్పున సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. ప్రైవేటు అసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ అసుపత్రులను తీర్చిదిద్దుతున్న ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. పులి రాజు, కొప్పుల పరుశరాములు, తడేం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో కాడెద్దు మృతి



మృతి చెందిన ఎద్దును చూపిస్తున్న రైతు బీరయ్య

**చేర్యాల, జులై 28, ప్రభాతవార్త:** విద్యుత్‌ఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన చేర్యాల మండలం రాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన రైతు శెట్టె బీరయ్య తెలిపిన వివరాల ప్రకారం రోజువారి మాదిరిగానే వ్యవసాయ బావి వద్ద కాడెద్దును మేతకు తీసుకెళ్ళగా విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై కాడెద్దు అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాడెద్దు విలువ సుమారు రూ.80వేలు వుంటుందని, బీద కుటుంబమైన బీరయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### వర్షాలతో ఇండ్లు కూలిపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి

**కొండపాక, జులై 28, ప్రభాతవార్త :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇండ్లు కూలి పోయిన బాధితులను ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి అదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొండపాక మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇండ్లు కూలి పోయిన బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపాక విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పరామర్శించి మాట్లాడారు. పాక్షికంగా, పూర్తిగా ఇండ్లు కూలి పోయిన వారికి నష్ట పరిహారం చెల్లించి ప్రభుత్వం వారిని అదుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మనోధైర్యంగా ఉండలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణరెడ్డి, అంకిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ జలిగామ నర్సింగరావు, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు కుంచెం రవి, వడ్లకొండ రవీందర్, దేవేందర్ చౌధరి, బోకే రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

### సిఐగా ప్రమోషన్ పొందిన కృష్ణమూర్తికి సన్మానం

**కొండపాక, జులై 28, ప్రభాతవార్త :** సిఐగా ప్రమోషన్ పొందిన ఎస్సై కృష్ణమూర్తిని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు. శుక్రవారం జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తిని కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, దుద్దెడ ఎంపిటిసి గురజాడ బాలాజీ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కుకునూరుపల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి, ఎస్సై పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఎస్సైగా వివిధ పోలీసు స్టేషన్‌లలో పని చేసి ప్రజల మన్ననలు పొందాడన్నారు. ప్రజలకు సేవ చేయలనే తపనతో ఉన్న ఎస్సై కృష్ణమూర్తికి సిఐగా ప్రమోషన్ రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దుద్దెడ ఉప సర్పంచ్ గుండెలి అంజనేయులు నాయకులు పిల్లి నాగరాజు, చిలుముల రాంమోహన్, మెరుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పొంగి పొర్లుతున్న చెరువులు



ఖాజాపూర్‌లో మత్తడి దూకుతున్న పటేల్ చెరువు

**చిన్నశంకరంపేట, జులై 28, ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండల పరిధి అంబాజీపేటలో బైండ్ల భాగ్యమ్మ, కుర్మ సంతోష్, సూరారంలో బాలపోచయ్య, మాందాపూర్ తండాలో లఖావత్ శ్రీనుల ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆర్ఐ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఖాజాపూర్‌లో పెద్ద చెరువు, పటేల్ చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. రైతులు వ్యవసాయ పొలాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

### వరి పంటల పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తీసివేయాలి

**మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్**



రైతులు వేస్తున్న వరి నాట్లను పరిశీలిస్తున్న ఏఓ అనిల్‌కుమార్

**నర్సాపూర్, జులై 28.ప్రభాతవార్త:** వర్షాలు విపరీతంగా కురుస్తున్నందున నాటు వేసిన వరి పంట పొలాల్లో నిల్వఉన్న నీటిని కాలువల ద్వార తీసివేయాలని నర్సాపూర్ మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని ఆద్మాపూర్ నాట్లు వేసిన వరి పంటపొలాలను ఆయన పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు రమావత్ మిన్యా పొలంలో నాట్లు వేయ డాన్ని ఆయన పరిశీలించడం జరిగింది ఈసందర్భంగా ఏఓ అనిల్‌కుమార్ మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో వరి నాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ మేరకు వర్షాల కాణంగా వరి పంటపొలాల్లో నిల్వ ఉన్న నీటిని కాలువల ద్వార తీసివేయాలన్నారు. నారు ఎరుపు రంగులోకి మారుతున్నందున దీని నివారణకు మ్యాన్కో జబ్, మరియు కార్బన్డజం పొడి మందు మిశ్రమంను 10 గ్రాముల నీటిలో కలుపుకొని పిచికారి చేస్తే నివారించుకోవచ్చని తెలిపారు. అంతేగాక ఆకులు తెల్లగా ఉండటం వల్ల లీటర్ నీటికి జింకు సల్ఫట్ ను లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేయడం వల్ల నివారించుకోవచ్చని చెప్పారు. వరి నాట్లు వేసేటప్పుడు పై కొనలు తుంచి నాటు వేయడం వల్ల కాండం తొలుచు పురుగు గుడ్లను నివారించుకోవచ్చని రైతులకు మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్ సూచించారు.

## వర్షాలకు కూలిన ఇండ్లను పరిశీలించిన ఆర్ఐ ప్రభాకర్

**కొల్చారం, జులై28 ప్రభాతవార్త:** గత పది రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రమైన కొల్చారంలో కూలిపోయిన ఇండ్లను శుక్రవారం ఆర్ఐ ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 14 ఇండ్లు కూలిపోయినట్లు సమాచారం సేకరించామని, వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మహమ్మద్, జిలాని, ఆరిఫ్, చింతల సత్తయ్య, శివ్వయ్య తదితరులు ఉన్నారు.

# అధిక దిగుబడులపై రైతులకు అధికారుల సూచనలు



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి రాజేష్

**పెద్దశంకరంపేట, జులై28 ప్రభాతవార్త:** రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచనల మేరకు ఏ పంట నైనా సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి రాజేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రైతులు సాగు చేసిన వరి, ప్రతి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వరి పొలాల్లో, ప్రత్తి మొక్కల మధ్య నీరు నిలవకుండా బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు వరి నాట్లు వేసిన పొలాలు పూర్తిగా దెబ్బతిన్నట్లయితే, ఆ పొలాలను దమ్ము చేసి మళ్లీ స్వల్పకాలిక రకాలను ఎంచుకొని నేరుగా విత్తుకోవాలని సూచించారు. సంప్రదాయ పద్ధతి నూనె గింజెల కన్నా ఆయిల్ ఫామ్ పంట నూనె దిగుబడి 4 నుంచి 5 రెట్లు అధికంగా ఉంటుందని తెలిపారు. మొక్కలు నాటి తరువాత 4వ సంవత్సరం నుండి కాపు మొదలై 30 సంవత్సరాల వరకు నిరంతర దిగుబడితో ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఆయిల్ ఫామ్ సాగుకు డ్రిప్ 90 శాతం రాయితీ, మొక్కలకు రాయితీలను ప్రభుత్వం అందజేస్తుంది కావున రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలుగా వరి, చెరువు, పండ్ల తోటలు తప్ప అన్ని పంటలు వేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది జిల్లాలో పెద్దఎతునతన పండ్ల తోటలు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. రైతులు ఎప్పుడూ ఒకే పంట కాకుండా పండ్ల తోటలు పెంచే విధంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కారు రైతులతో పాటు ఐదెకరాల లోపు భూమి గల పట్టాదారులు, ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన వారు, బోరు, బావి, ఎలక్ట్రిసిటీ ఉన్న రైతులు అర్హులని తెలిపారు. 1 నుంచి 3 సంవత్సరాల పాటు యాజమాన్యం డబ్బులు వందశాతం ఉపాధి మామీ పథకం నుంచి అందజేస్తుందని వివరించారు. రైతులు ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఉద్యానవన శాఖ ద్వారా మైక్రో ఇరిగేషనన అందించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ విస్తరణ అధికారి మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

**బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం**

**సిద్దిపేట రూరల్, జులై 28, ప్రభాతవార్త :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత వ్ం పూర్తిగా విఫలమవుతుందని బిఎన్అర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులకు శాశ్వత లేబర్ కార్డులు అందజేయాలని ఎన్నో నెలలుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు కింద పడి మరణిస్తే రూ.10 లక్షల బీమా వర్తింప చేయాలని కార్మికుల పిల్లలకు కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇళ్లు లేని నిరుపేద కార్మికులకు డబుల్ బెడ్ ఇళ్లు కేటా యిస్తామని నేటికి అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరిన పట్టి ంచుకోవడం లేదన్నారు. బిఎన్అర్‌కేఎస్‌కకు చెందిన నా యకులకు మాయమాటలు చెప్పి బిఅర్ఎస్‌లో పార్టీలో చేర్చుకుంటున్నారని మండి పడ్డారు. ఎన్ని హామీలు ఇచ్చిన బిఎన్అర్‌కేఎస్ నుంచి కార్మికులను ఎవరూ విడదీయ లేరన్నారు. కార్మికులు ఎవరి మాయలో పడకుండ హక్కుల సాధించే వరకు పోరాటం చేద్దామన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి : సర్పంచ్

**మిరుదొడ్డి, జులై 28, ప్రభాతవార్త :** బిఅర్ఎస్ సర్కారు హయాంలో గ్రామీణ ప్రాంతాలతో పాటు కొండాపూర్ అభివృద్ధిలో దూసుకుపోతుందని సర్పంచ్ పెద్ది కవిత తెలిపారు. శుక్రవారం అమె మాట్లాడుతూ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిల సహకారంతో రజక సంఘానికి రూ.5 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. గతంలో హామీ ఇచ్చిన విధంగా మంత్రి హరీష్‌రావు ప్రత్యేక నిధుల ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. గతంలో పాల కేంద్రం భవనం కోసం రూ.10 లక్షలు, బతుకమ్మ మెట్ల కోసం రూ. 7.5 లక్షలు, అర్అండ్‌బి ద్వారా మురికి కాల్వల నిర్మాణం కోసం రూ.14 లక్షలు, సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం కోసం రూ.30 లక్షలు, ముదిరాజ్ సంఘానికి రూ.15 లక్షలు, కుర్మ సంఘానికి రూ.10 లక్షలు, ఎస్సీ సంఘ భవనాల నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న మంత్రి హరీష్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు సర్పంచ పెద్ది కవితరాజు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బిఅర్ఎస్ నాయకులు నంట బాపురెడ్డి, గుండం రాజమహేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కౌన్సిలర్

**హుస్నాబాద్‌టౌన్, జులై28, ప్రభాతవార్త :** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌన్సిలర్ బోజు రమాదేవిరవిందర్ అన్నారు. శుక్రవారం రోజున పట్టణంలోని రెండవ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్యమే మహాభాగ్యం కార్యక్రమంలో భాగంగా వార్డు కౌన్సిలర్ రమాదేవి ఆధ్వర్యంలో వార్డులోని ఇంటింటికి తిరుగుతూ కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని త్రాగే నీటిని వేడి చేసుకుని చల్లార్చి తాగాలని సూచించారు. తమ ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూ సుకోవాలని, నీరు నిల్వ ఉండడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్ర మంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలి

**అక్కన్నపేట, జులై28, ప్రభాతవార్త:** ప్రజలు ఈవిఎం విషన్‌లో ఓటు వేసే విధానపై అవగాహన కలిగి ఉండాలని గిరిదావర్ సుహాసిని అన్నారు. శుక్రవారం రోజున మండలంలోని జనగామ, గుబ్బడి గ్రామాలలో ఈవిఎం మిషన్‌లో ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో బెన్‌షాలోమ్ సూచనలతో ఈ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కరీంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

**చిన్నశంకరంపేట, జులై 28, ప్రభాతవార్త:** సిజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి సూచించారు. గురువారం చిన్నశంకరంపేట పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్నాయని, మొక్కలను నాటడంపై దృష్టి సారించాలన్నారు. పారిశుద్యం లోపించకుండా చూడాలని, వర్షపు నీరు నిలువకుండా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు గ్రామస్తులు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో గిరిధర్‌రెడ్డి, ఏపీవో వెంకటసాయి గౌడ్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న మోటారు సైకిల్

**ఒకరి మృతి.. నలుగురికి గాయాలు**

**ఝరాసంగం, జులై 28, ప్రభాతవార్త:** ఎదురుగా వస్తున్న ఆటోను సైకిల్ మోటారు సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికి అ్కడే మృతి చెందగా నలుగురు గాయాలకు గురైన సంఘటన మండల పరిధిలోని కృష్ణాపూర్ కమాన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ 2 కృష్ణగౌడ్‌ల కథనం ప్రకారం...జహీరాబాద్ డివిజన్ పరిధిలోని రాయికోడ్‌కు చెందిన బాగ్యన్ మాజిద్ (30) ఆటోను తోలుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రంతంలో ఆటో (టిఎస్ 15 యుసి0780)లో ప్రయాణీకులను ఎక్కించుకుని రాయికోడ్ వస్తుండగా ఝరాసంగం వైపు నుంచి ద్విక్ర వాహనం (టిఎస్ 15 ఈడి 5722)పై చోదకుడు రాంగ్ రూట్‌లో వచ్చి ఆటోను ఢీకొన్నట్టు పేర్కొన్నారు. ప్రమాదలో ఆటో డ్రైవర్ అక్కడికి అక్కడే మృతి చెందగా ఆటోలో ప్రయాణిస్తున్న శేఖాపూర్‌కు చెందిన తమ్మలి వీరన్న, యండి పాషామియా, చందు, కావేరిలకు గాయాలకు గురయ్యారన్నారు. ఆటోలను డీకొన్న ద్విచక్ర వాహన చోదకుడు అక్కడి నుంచి పరారయ్యాడన్నారు. మృతుడి సోదరుడు బాబ్యన్ జావిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐలు పేర్కొన్నారు.

### పాత గ్రామ సేవకులకు న్యాయం చేయాలని వినతి

**అల్లాదుర్గం, జులై 27, ప్రభాతవార్త:** ఎన్నోఏండ్లుగా తాతల కాలంనుండి గ్రామాల్లోన వంతులవారిగా గ్రామ సేవకులుగా గ్రామాలకు సేవలందిస్తున్న నీరుడి విధానాన్ని పాతపద్ధతిలోనే కొనసాగించాలని కోరుతూ మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల తహశీల్దార్ తలుసిరాంకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వీరికి అల్లాదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు కంచరి బ్రహ్మాం సంఘీభవం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గ్రామాల్లో గ్రామసేవకులు నిరుడి వంతులవారిగా గ్రామానికి సేవలిందిస్తున్నారని ఇప్పటికి వీరికి జీవనాధరం తెలంగాణ ప్రభుత్వం తీసుక వచ్చిన జీవో81 ప్రకారం వీరికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యకంత చేశారు. వీరు ఉపాధి కోల్పోయో అవకాశంఉందనిన పాత విధానాన్ని కొనసాగించాలని లేదా ప్రత్యామ్నా య ఉపాది కల్పించి వారికి న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల సేవకులు నాయకులు జోగినాథ్‌గౌడ్, మల్లయ్య, జగన్‌లతో పాటుతదితరులున్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న మహేష్‌గుప్త

### మూడు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

**శివ్వంపేట, జులై28 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మూడు బాధిత కుటుంబాలను పరామర్శించిన జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త శుక్రవారం 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి భరోసా కల్పించారు. శివ్వంపేటకు చెందిన లస్కరి భిక్షపతి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మహేష్‌గుప్త వారి వైద్య ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా తాళ్లపల్లి తండాకు చెందిన గుగులోత్ లక్ష్మి ఇల్లు భారీ వర్షాల వల్ల కూలిపోవడంతో ఆమెను పరామర్శించి తన వంతు సహాయంగా 5 వేల రూపాయలను అందజేశారు. కాగా గోమారం గ్రామానికి చెందిన పందిముక్కుల నర్సింగరావుగౌడ్ ప్రమాదంలో చనిపోవడంతో వారి స్వగృహానికి వెళ్లి మహేష్‌గుప్త 10 వేల రూపాలయ ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, ఉప సర్పంచి రాజిపేట పద్మ వెంకటేష్, వార్డు సభ్యులు పోచాగౌడ్, వంజరి కొండల్, నాయకులు ముద్దగళ్ల రాజు, కొత్తపేట శ్రీనివాస్‌గౌడ్, ప్రణీత్‌రెడ్డి, గ్రామస్తులు, తండావాసులు పాల్గొన్నారు.

### శుభకార్యానికి వెళ్లి చిన్నారిని ఆశీర్వదించిన జెడ్పీటీసీ



చిన్నారిని ఆశీర్వదించిన మహేష్‌గుప్త

**శివ్వంపేట, జులై28 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన మంతూరి నర్సింలుగౌడ్ మనుమరాలు తొట్టెల శుభకార్యం మండల పరిధిలోని చందిశివారులో గల జేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త ఆశీర్వదించడం జరిగింది. అదేవిధంగా ఈ శుభకార్యానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. సుదర్శన్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాసంపల్లి శ్రీనివాస్‌గౌడ్, తిమ్మాపూర్ మాజీ సర్పంచి భిక్షపతిగౌడ్, గొల్లపల్లి ఉప సర్పంచి గణేష్‌గౌడ్, సీనియర్ నాయకులు మంతూరి రమేష్‌గౌడ్, భానూరి నారాగౌడ్, సీనియర్ జర్నలిస్టు ఇసుగారి మల్లేష్, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

### శివ్వంపేట మండలంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పర్యటన



వర్షానికి కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**శివ్వంపేట, జులై028 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలంలోని దొంతి, సీతారాం తండా గ్రామ పంచాయతీల పరిధిలోని శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కూలిపోయిన ఇళ్లను పరిశీలించడం జరిగింది. సీతారాంతండాలో కూడా ఇళ్లు కూలిపోయిన బాధితులను పరామర్శించి ప్రభుత్వం తరపున తప్పకుండా ఆదుకునే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ శాఖ అధ్యక్షులు, కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు దొంతి, సీతారాంతండాలలో వర్షం కారణంగా ఇళ్లు, గుడిసెలు కూలిపోయి నిరాశ్రయులైన వారికి రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ శాఖ తరపున వంట సామాగ్రి, కప్పుకోవడానికి బ్లాంకెట్లను అందజేశారు. రెస్‌క్రాస్ సొసైటీ మెదక్ శాఖ వారు సహాయం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, శివ్వంపేట తహశీల్దార్ శ్రీనివాసచారి, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పి. లక్ష్మణ్ యాదవ్, కార్యదర్శి సుభాష్‌చంద్రబోస్, కోశాధికారి డీజీ. శ్రీనివాస్‌శర్మ, సభ్యులు దేమె యాదగిరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, స్థానిక సర్పంచులు ఫణి శశాంక్‌శర్మ, బోనోత్ సోని రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

### సోయం బాబురావును ఎంపి పదవి నుండి తొలిగించాలి

**గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు లకావత్ రమేశ్‌నాయక్**

**నర్సాపూర్, జులై 28.ప్రభాతవార్త:** గిరిజనుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిలాబాద్ ఎంపి సోయం బాబురావుకు తగదని ఆయన వెంటనే గిరిజనులకు క్షమాపణ చెప్పాలని. ఎంపి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తు శుక్రవారం ఎంపి సోయం బాబురావు దిష్టి బొమ్మను దహనం చేశారు. శుక్రవారం నర్సాపూర్‌లోని అంబెద్కర్ చౌరస్తాలో గిరిజన సంఘం అధ్వర్యంలో ఎంపి సోయం బాబరావు దిష్టిబొమ్మను నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్ పార్కు నుండి ఊరేగింపుగా తీసుకవచ్చి అంబెద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు లకావత్ రమేశ్ నాయక్ మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎంపి సోయం బాబురావు ఎస్టీ జాబితా నుండి గిరిజనులను తొలిగించాలని మాట్లాడటం సరైంది కాదన్నారు. గిరిజనుల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన సోయం బాబరావును ప్రదాన మంత్రి నరేంద్రమోడి, కేంద్ర మంత్రి అమిత్ షా తో పాటు , రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి లు కలుగ చేసుకొని ఎంపి పదవి నుండి తొలిగించి గిరిజనులకు క్షమాపణ చెప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు శివాజీనాయక్, అంబర్‌సింగ్, సామ్యానాయక్, రాము, అమర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



బాబురావు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

## ఇండ్లు కూలిన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలి

**మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దర్జి రాజు**

**కొల్చారం, జులై28 ప్రభాతవార్త:** కొల్చారం మండలంలోని అన్ని గ్రామాలలో ఇండ్లు కూలిన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దర్జి రాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలను ఇండ్లు కూలిపోయిన బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయిం చాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి బాధితులను గుర్తించి వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించాలన్నారు. తెలంగాణ వస్తే బ్రతుకులు బాగుపడతాయని అనుకున్నామని, కానీ నాయకుల జీవితాలు బాగుపడతాయని అనుకోలేదన్నారు. ప్రభుత్వం ప్రజల పట్ల ఎందుకింత చిన్నచూపు చేస్తుందో అర్థం కావటం లేదని, ప్రభుత్వం స్పందించకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

### ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు



మాట్లాడుతున్న మండల బీజేపీ అధ్యక్షులు దయాకర్‌గౌడ్

**కొల్చారం, జులై28 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా మొదటి విడతలో 1.25 లక్షల రైతు సేవా కేంద్రాలను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. మండల కేంద్రమైన కొల్చారంతో పాటు వరిగుంతం రైతు ఆగ్రోస్ కిసాన్ సేవా కేంద్రం. చిన్నఘనపూర్, వరిగుంతం, రంగంపేట (పీఏసీఎస్)లలో కిసాన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినందుకు, కిసాన్ సమ్మాన్ నిధి 14వ విడతలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన సందర్భంగా మండల పరిధిలోని రైతులు, బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు పాతూరి దయాకర్‌గడ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణగౌడ్, మాణిక్య అశోక్, మండల ప్రధాన కార్యదర్శి పాల్వంచ రాజేందర్‌గౌడ్, మండల ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ చౌరిగారి భాస్కర్, బూత్ అధ్యక్షులు కృష్ణాగౌడ్, సంతోష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పీర్లకు దట్టీలు సమర్పించిన శ్రీనివాస్‌గౌడ్

**పెద్దశంకరంపేట, జులై28 ప్రభాతవార్త:** మొహర్రం పండుగ ఉత్సవాలను పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని పెద్ద లాల్‌సాబ్ పీర్లకు మాజీ కేంద్ర ఫుడ్ కార్పోరేషన్ డైరెక్టర్, విగ్రం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విగ్రం శ్రీనివాస్‌గౌడ్ గురువారం రాత్రి పీర్లకు దట్టీలు సమర్పించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని ప్రార్థించారు. అనంతరం లాల్‌సాబ్ పీర్ల నిర్వాహకులు విగ్రం శ్రీనివాస్‌గౌడ్ విగ్రం శ్రీనివాస్‌గౌడ్ చేతికి ఆమేజామిన్ కట్టి ఆయన ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలను ప్రశంసించారు. సుల్తాన్, అహ్మద్, గౌస్, గంగాధర్‌గౌడ్, భూమేశ్వర్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### పాము కాటువేసిన వ్యక్తికి ఎమ్మెల్యే పరామర్శ



రైతు ఆంజనేయులును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, జులై28 ప్రభాతవార్త:** మెదక్ మండలం మక్తా భూపతిపూర్ గ్రామ సర్పంచి సుంకరి నర్సింలు కొడుకు ఆంజనేయులు పొలం దగ్గర వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పాము కరిచింది. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని ఆంజనేయులును పరామర్శించారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ సుదాకర్ ఆంజనేయులు ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందజేయాలని జిల్లా ఆసుపత్రి సమన్వయకర్త చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మెదక్ ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, మెదక్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, నాయకులు రాగి అశోక్, సంగ శ్రీకాంత్, నవీన్, సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నర్సాపూర్ రాయరావు చెరువును సందర్శించిన ఎమ్మెల్యే



రాయరావు చెరువును సందర్శించి గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

**నర్సాపూర్, జులై 28.ప్రభాతవార్త:** నర్సాపూర్ రాయరావు చెరువును ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి శుక్రవారం సందర్శించి పరిశీలించారు. గత కొన్నిరోజుల నుండి కరుస్తున్న వర్షాలకు రాయారావు చెరువు నిండి అలుగు పారుతుంది. ఈ అలుగు పారడాన్ని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అలుగు ను పరిశీలించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి గంగమ్మకు పసుపు, కుంకుమ అక్షితలు చల్లి పూజలు చేయడం జరిగింది. అనంతరం కట్ట మైసమ్మ తల్లికి కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణ సమీపంలోని 731 సర్వేనెంబర్‌లో గల 35 ఎకరాల ప్రభుత్వ భూమిలో వివిద కుల సంఘాల కమ్యూనిటి భవనాలు నిర్మించేందకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిదంగా దేవాదాయ శాఖ కు సంబందించిన భూమి 125 ఎకరాల్లో వివిద ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడంతో పాటు ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా గంగమ్మ తలికి, కట్ట మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి ప్రజలను పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఎల్లప్పుడు చల్లంగా చూడాలని ఆ అమ్మవార్లను ఎమ్మెల్యే మద న్‌రెడ్డి వేడుకున్నారు. ఈకార్యక్రమంలోజిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, నాయకులు కుమ్మరి నాగేశ్, జ్ఞానేశ్వర్ గుప్త, ఆంజనేయులుగౌడ్, సాగర్, రాకేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కట్టమైసమ్మ తల్లికి పూజలు చేసిన ఎమ్మెల్యే

## రేపు గ్రామ దేవతల పునశ్చరణ-బోనాల పండగ

**మనూర్, జులై 28, ప్రభాతవార్త:** ఈ నెల 30వ తారీఖున మండలంలోని దోసపల్లి గ్రామంలో గ్రామ దేవతల పునశ్చరణ (లక్ష్మీ దేవత, మైసమ్మ, ఉరడమ్మ, పోచమ్మ), బోనాల పండగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటి బాధ్యులు పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, స్వసినత పుణ్యహవచనము, అఖండ దీపారాధ, పంచగవ్య ప్రశాన, కంకణధారణ, ఉదయం 9 గంటలకు అమ్మవార్లకు అబిషేకం, అలంకరణ, హనుమత్ అభిషేక చందన పూజ, ఉదయం 11 గంటలకు మండల ఆరాధన, 16 మాతృక, సప్తమాతృకలు వాస్తు క్షేత్రపాలక, బ్రహ్మాదిమండలము, కలశ స్థాపనస, అష్టధిక్పాలక, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 1 గంటకు హోమ కార్యక్రమాలు, సాయంత్రం 4.30 గంటలకు కుంకుమార్చన, 6 గంటలకు గ్రామ దేవతల బోనాల కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం 10.30 గంటల ఉంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. భక్తులు పూజా కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామస్థులు వినతి చేశారు.

## పెద్దాపూర్‌లో సంధ్యా శిబిరం విజయంతం

**సదాశివపేట, జులై 28, ప్రభాతవార్త:** సదాశివపేట ఎస్‌బిఐ, ఏసిబి ఆధ్వర్యంలో మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని రైతు వేదికలో సంధ్యా శిబిరం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వై సూర్య ప్రకాశరావు పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. వనయవాసయ ఉత్పత్తుల గురించి ఉత్పత్తుల ఉపయోగం, రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం నర్సిములు, గ్రామ సర్పంచ్ కె నాగేందర్, ఏసిబి సదాశివపేట శాఖ మేనేజర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త పిచ్చి మొక్కల తొలగింపు : కార్పొరేటర్




చెత్త పిచ్చిమొక్కలను తొలగింపజేయిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జులై 28, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయా కాలనీ ప్రజల వినతి మేరకు రోడ్డుకు ఇరువైపు గల పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ తెలిపారు. తన సొంత నిధులతో జెసిబి యంత్రాన్ని తెప్పించి మయూరి నగర్ కరెంటు కార్యాలయం నుంచి ఏషియన్ హాస్పిటల్ వరకు చుట్టు పక్కల గల చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించి ట్రాఫిక్ సమస్యలలు కల్గకుండా చర్యలు తీసుకున్నామన్నారు. బీరంగూడ కమాన్, కరెంటు ఆఫీసు రోడ్డులో రోడ్డుకు ఇరువైపుల బైక్‌లు పార్కింగ్ చేయడం మూలంగా ప్రయాణీకులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని, వాహన చోదకులు తమ వాహనాలను రోడ్డుకు ఇరువైపుల ప్రజలకు ఇబ్బందులు కలిగేలా పార్కింగ్ చేసుకోకుండా ఉండాలని, నిబంధనలు ఉల్లగిస్తే ట్రాఫిక్ శాఖ తగు చర్యలు (చలాన్లు, బైకుల సీజ్) తీసుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, మహిపాల్‌రెడ్డి, వెంకట్ రామ్‌రెడ్డి, దేవేందర్ యాదవ్, రమేష్, సిఎం మల్లేష్, లింగం, వెంకటేష్, వాసుదేవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందజేసిన ఎంపి బిబి పాటిల్

**చౌటకూరు, జులై 28, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరు గ్రామానికి చెందిన రాజన్నోళ్ల రంగయ్యకు గురువారం ఎంపి బిబి పాటిల్ 60వేల రూపాయల ఎల్‌ఓసిని అందచేశారు. రంగయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్నట్లు తెలుసుకున్న ఎంపి బిబి పాటిల్ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకంలో 60వేల రూపాయలను మంజూరు చేయించి గురువారం కుటుంబ సభ్యులకు అందచేశారు. ఎల్‌ఓసి అందుకున్న రంగయ్య కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, అందుకు సహకరించిన ఎంపి బిబి పాటిల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## నారింజ ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే



నారింజ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని జహీరాబాద్-బీదర్ రోడ్డుపై గల నారింజ ప్రాజెక్టును శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పరిశీలించారు ఈ సందర్బంగా అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ప్రజలకు, ప్రయాణీకులకు ఇబ్బందులు కల్గకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను, పోలీసులను సూచించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గుండప్ప, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దీన్, కొత్తూర్(బి), మెటల్‌కుంట గ్రామాల సర్పంచ్‌లు జగన్‌మోహన్‌రెడ్డి, పీటర్ రాజు, నాయకులు రమేష్‌రెడ్డి, శంకర్, ఈరన్న పాటిల్, శ్రీకాంత్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని డ్రైవింగ్ లైసెన్సులు లేని యువకులు ఉచితంగా అందచేస్తున్న డ్రైవింగ్ లైసెన్సు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కా ర్యాలయంలో వంద మంది యువకులకు డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్సులు అందచేశారు. లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి లర్నిం గ్ లైసెన్సులు అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, యవకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన మద్రి నాయకులు



నరోత్తం సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన మద్రి నాయకులు

**జహీరాబాద్(కోహీర్), జులై 28, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కోహీర్ మండలంలోని మద్రి గ్రామానికి చెందన నాయకులు శుక్రవారం కారెక్కారు. బిఆర్ఎస్ నాయకులు వై నరోత్తం సమక్షంలో పార్టీలో చేరిన నాయకులను నరోత్తం పార్టీ ఖండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో యాదవరెడ్డి, జంజీద్ మియా, గౌసొద్దీన్, ఇష్టేకర్, ఝరాసంగం మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ వాజిద్, గంగాపూర్ నబిసాబ్, మద్రి రాజేందర్ తదితరులు ఉన్నారు.

## కూలిపోయిన ఇండ్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**నర్సాపూర్, జులై 28.ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిఫల్ పరిధిలోని 15 వ వార్డులోగల ఎస్సీ కాలనీలో కూలి పోయిన ఇండ్లను శుక్రవారం నర్సాపూర్ మున్సిఫల్ కమీషనర్ వెంకట్ గోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ వెంకట్ గోపాల్‌తో పాటు మండల ఆర్.ఐ, మరియు కౌన్సిలర్ పంబళ్ళ లలిత, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి కలిసి వార్డు మొత్తం పర్యటించారు. ఈ సందర్బంగా వారు కూలీపోయిన పలు ఇండ్లను పరిశీలించడం జరిగింది. ఈ మేరకు మళ్ళీ కొత్తగా ఇండ్లను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అన్నివిదాల ఆదుకుంటుందని వారు తెలిపారు.

# లబ్దిదారునికి ఎల్ఓసి అందజేత



ఎల్‌ఓసిని అందజేస్తున్న దృశ్యం

**కోహెడ, జులై 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జనగాం చంద్రయ్య అరోగ్య రీత్యా అపరేష న్‌కు డబ్బులు లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను బిఆర్ఎస్ నాయకులు వెంటనే సమస్యను హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి రూ. 2 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. దీంతో హైదారాబాద్‌లోని నిమ్స్ అసుపత్రిలో అపరేషన్ చేయించుకోవడానికి శుక్రవారం ఎల్‌ఓసిని అందజేశారు. ఎల్‌ఓసి మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు బిఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయడ చంద్ర పరశరాములు గౌడ్, బిఆర్ఎస్ నాయకులు తిరుపతిగౌడ్, ఉప సర్పంచ్ మహమ్మద్ రబ్బాని, వార్డు సభ్యులు బోయిని రాజయ్య, మద్ది శ్రీనివాస్‌గౌడ్, రైతు బంధు కో-అర్డినేటర్ బత్తిని మల్లయ్యగౌడ్, రైతు బంధు గ్రామ డైరెక్టర్స్ పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బత్తిని సంపత్‌గౌడ్, పైడిపల్లి సంపత్, గ్రామ నాయకులు మెండే భూమయ్య యాదవ్, జనగాం అదర్శ్ తదిత రులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి అర్థిక సహాయం అందజేత**

మండల పరిధిలోని పరివేద గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎడబోయిన రామచంద్రం అనారోగ్యగంతో మృతి చెందగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్ రూ.30 వేల అర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి పంపించారు. దీంతో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అవుల మహేందర్, సీనియర్ నాయకులు కొక్కుల సురేష్ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే సతీష్ కుమార్ పంపించిన అర్థిక సహాయాన్ని బాధిత కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో పొన్నం అంజయ్య, లింగం, పాము శ్రీకాంత్, ఉప్పలయ్య,అశోక్, మొండయ్య, మీసా కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నర్సింగ్‌రావు

## పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

**మనూర్, జులై 28, ప్రభాతవార్త:** మండలంలోని మాయికోడ్ గ్రామంలో వర్షాలకు నీటమునిగిన పంటలను జిల్లా వ్యవసాయ అధికారి నర్సింగ్‌రావు శుక్రవారం పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పత్తి, కంది, పెసర, మునుము పంటలను పరిశీలించి మొక్కలు వడలు చూపుతున్నట్లు గుర్తించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నర్సింగ్‌రావు పేర్కొన్నారు. పంటలో నీరు నిల్బుని ఉండటంతో మొక్కలకు ఆక్సిజన్ అందే అవకాశాలు ఉండవని, అందుకు రైతులు అంతర్ కృషి (కలపుదీయడం) చేసుకోవాలన్నారు. మొలక వేర్లకు గాలితగిలేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాపర్ ఆక్సి క్లోరైడ్ (సిఒసి) 30 గ్రాములు, 2 గ్రాముల ప్లాటోమైసిన్ 10 లీటర్ల నీటిలో కలుపుకుని మొక్కల మొదళ్లు తడిచేటట్లు పిచికారి చేసుకోవాలన్నారు. బూస్టర్ దోస్‌గా మొక్కలు కోలుకున్నాక యూరియ 25 కిలోలు, పోటాష్ 10 కిలోల చొప్పున పంటలకు వేసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా రైతు భీమా చేసుకోని రైతులు వెంటనే రైతు భీమా కోసం ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ప్రజలకు సూచించారు. రైతులు తమ పట్టాపాసుపుస్తకాలు, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్సులను క్లస్టర్ ఏఈఓలకు అందచేసి భీమా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ సంగమేశ్వర్, గ్రామ సర్పంచ్ అనిత సుధాకర్, ఎంపిటిసి సభ్యులు శంకరమ్మ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ, ఆరోగ్య సిద్దిపేటకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



23వ వార్డులో అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ లక్ష్మణ్

**సిద్దిపేట రూరల్, జులై 28, ప్రభాతవార్త:** పట్టణంలోని 23వ వార్డులో మంత్రి హరీష్‌రావు అదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజులరాజనర్సు సూచనలతో గత 5 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, విరోచనాలు వంటి వ్యాధులు రాకుండా చూసుకోవాలని నీళ్లు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్ అధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనానికి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అర్పీ లావణ్య, అంగన్‌వాడీ టీచర్ వనిత, వార్డు అఫీసర్ రవి, అశ వర్కర్లు, పబ్బోజి దయాకర్, అకుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

**37వ వార్డులో..** సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 37వ వార్డులో శుక్రవారం మంత్రి తన్నీరు హరీష్‌రావు అదేశాల మేరకు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఅనంద్ అధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కూళాయిలలో నిల్వ చేసిన నీటిని తొలిగించి వేశారు. నీటి కుండీలను పగలకొట్టారు. ప్రస్తుత వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు. మంత్రి హరీష్‌రావు అదేశాల మేరకు ప్రతి శుక్రవారం వార్డులో ఫ్రై డే డ్రై డేగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అరోగ్య, స్వచ్ఛ సిద్దిపేటే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మంత్రి హరీష్‌రావు అశయని ప్రతి ఒక్కరం సహకరిద్దామన్నారు. కార్యక్రమంలో అర్‌పి మమత, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా ఎమ్ఎస్ఎస్‌వో

**రామాయంపేట, జులై 28, ప్రభాతవార్త:** రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన గజం శంకయ్య అనారోగ్యంతో మరణించగా ఎమ్ఎస్ఎస్‌వో సభ్యుల నుండి చరవాణి ద్వారా తెలుసుకున్న మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజింగ్ చైర్మన్ మైనంపల్లి రోహిత్‌రావు ఎమ్ఎస్ఎస్‌వో నియోజకవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి ద్వారా తక్షణ సహాయం కింద 5వేల రుపాయలను ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోచమైన కుమార స్వామి, పోచమైన బూకర్న, సార్గు రమేష్,పోచమైన నాగరాజు, చాకలి యాదగిరి, రొద్ద లక్ష్మణ్, చాకలి నర్సింలు, రొద్ద రాములు, రాజారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 124వ రోజులకు చేరిన రెవెన్యూ దీక్షలు

**రామాయంపేట, జులై 28, ప్రభాతవార్త:** రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 124వ రోజులకు చేరాయి. ఈ సందర్బంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ దీక్ష చేపట్టి ఇన్ని రోజులు గడిచినప్పటికి స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం అత్యంత బాధకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. లాగే కుల సంఘాల నాయకులను పిలుచుకోని మాట్లాడితే ఓట్లు రావని, ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే స్పందించి వెంటనే రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ఎక్కడ పద్మక్క?

**మెదక్ అర్బన్, జులై28 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని రోడ్లపై వరి నాట్లు వేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు నిరసన తెలపడం జరిగింది. ఈ సందర్బంగా బీజేపీ నాయకులు మాట్లడుతూ గత 9 సంవత్సరాల నుండి మెదక్ పట్టణంలోని ఎలాంటి అభివృద్ధి లేదని, వర్షానికి నీళ్ల ఇళ్లలోకి వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓట్ల కోసం పర్యటించడం సరికాదని, ఈ తొమ్మిదేళ్లలో మీ కుటుంబం ఆస్తులు పెంచుకున్నారని, మెదక్ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రోడ్లు, డ్రైనేజీ, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ పటేల్, బీజేపీ ప్రధాన కార్యదర్శి సుంకోజి రాజు, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బక్కవారి శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు కల్కి నాగరాజు, మల్లేశం, బబ్లు, శశాంక్, భాను, శేఖర్, సందీప్, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లపై నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



అనురాగ్ థియేటర్ వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

### -సమస్య పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**జహీరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పట్టణంలోని పలు ప్రాంతాలను శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను, నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లతో, నిలిచిన వరద నీటితో అవస్థలు పడుతున్నామని పట్టణంలోని అనురాగ్ టాకీస్ ప్రాంతంలోని బసవేశ్వర కాలనీ వాసులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. మురుగుకాల్వలు లేకపోవడంతోనే సమస్య ఉత్పన్నం అవుతోందని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. పట్టణంలోని మున్సిపల్ మోడల్ మార్కెటింగ్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. కాంప్లెక్స్ లోపల వ్యాపారాలు చేసుకోకుండా రోడ్లపైనే కూరగాయలు అమ్ముకుంటున్న వ్యాపారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఆత్మ కమిటి చైర్మన్ ఎస్ వెంకట్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు మంకాల్ సుభాష్, అల్లాడి నర్సింలు, గుండప్ప, సుభాష్‌రెడ్డి, కల్వ చంద్రశేఖర్, మోహియొద్దిన్, నీల రాజేశ్వర్, మున్సిపల్ కమీషనర్ జి మల్లారెడ్డి, డీఈ దీప్తి చంద్ తదితరులు పాల్గొన్నారు.

## మేదపల్లిలో పర్యావరణ ప్రకృతి దినోత్సవం



మేదపల్లిలో రోడ్డుకు ఇరువైపుల పూలమొక్కలు నాటుతున్న దృశ్యం

**ఝరాసంగం, జులై 28, ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ ప్రకృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని మేదపల్లి గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ మాట్లాడుతూ హరిత హారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల నాటిక మొక్కల పరిరక్షణకై జాతీయ ఉపాధి హామి కూలీలతో పూలమొక్కలను నాటించినట్లు పేర్కొన్నారు. గతంలో నాటిన మొక్కల చుట్టూ మొలచిన పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్ శోభారాణి, ఉపాధి హామి కూలీలు గంగారాం, మాణయ్య, సంగన్న, మొగులయ్య, కాశీం పటేల్ తదతరులు ఉన్నారు.

## బెంగుళూర్ యూత్ కాంగ్రెస్ కన్వెన్షన్‌లో పాల్గొన్న యువజన కాంగ్రెస్ నాయకులు



యూత్ కాంగ్రెస్ కన్వెన్‌లో పాల్గొన్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, జులై 28, ప్రభాతవార్త :** జాతీయ యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో కర్ణాటక ర్ష్టంలోని బెంగుళూర్‌లో ఈనెల 26,27,28 తేదీలలో మూడు రోజుల పాటు నిర్వహించిన బేతర్ భారత్‌కి దునియా అనే కార్యక్రమం అతిపెద్ద కన్వెన్షలో సిద్దిపేట జిల్లా నుంచి సిద్దిపేట పట్టణానికి చెందిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పూజల గోపికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో ఉన్న యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు కన్వెన్షలో పాల్గొన్నారని తెలిపారు. మొదటి రోజు కార్యక్రమంలో కర్ణాటక సిఎం సిద్దిరామయ్య, డిప్యూటి సిఎం డికె శివకుమార్, అల్ ఇండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బివి శ్రీనివాస్, జాతీయ ఇంచార్జి కృష్ణ, ఎఐసీసీ కార్యవర్గ సభ్యులు హాజరైనట్లు తెలిపారు. మరో రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు. యువనేత రాహుల్‌గాంధీ అన్‌లైన్ ద్వారా యువత, పార్టీ బలోపేతంపై చర్చించారని వివరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజీద్‌ఖాన్, అర్వింద్, శ్యామ్, శ్రీకాంత్, కేసర్, శ్రీహరి, శ్రీనివాస్, వెంకటేష్, రంసింగ్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## రైతులు పంటల విషయంలో జాగ్రత్తలు పాటించాలి

### -జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశా కుమారి

**మెదక్ అర్బన్, జులై28 ప్రభాతవార్త:** ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైతులు పంటల విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని, ఈ విషయంలో వ్యవసాయ అధికారులు సూచించినట్లుగా జాగ్రత్తలు పాటించినట్లయితే ఎక్కువ మొత్తం పంట నష్టం జరగకుండా ఉంటుందని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి ఆశా కుమారి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న, కంది, సోయాబిన్, మినుము, పెసర వంటి పంటల్లో నీరు నిల్వ ఉండటం వల్ల పంటలు ఎరుపు రంగులోకి మారి ఎదుగుదల లోపిస్తుందన్నారు. అందుకు రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సప్రందించి వారు సూచించిన జాగ్రత్తలు పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల్లో నిలిచిన నీటిని బయటకు పంపే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఎడ్లు, కూలీలు, దంతెల సహాయంతో భూమి గుట్టబారే విధంగా చేయాలన్నారు. దీని నివారణకు వంద శాతం నీటిలో కరిగే 19-19-19, 13-0-45 వంటి పోషకాలను ఐదు గ్రాముల నుంచి పది గ్రాముల వరకు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ వాతావరణ ప్రభావం వల్ల తెగుళ్ల సోకే అవకాశం ఉన్నందున వీటి నివారణకు కార్బండిజన్, మ్యాంకోజెబ్ పొడిని రెండు గ్రాములు లీటరన నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాలకు గతంలో వేసిన ఎరువులు కొట్టుకుపోయే అవకాశం ఉన్నందున పొలం గట్లను సరిచేసి బూస్టర్ దోస్‌గా 10-15 కిలోల యూరియాను 15 కిలోల పొటాష్‌తో కలిపి చల్లుకోవాలన్నారు. ఏదైనా తెగులు, పురుగు ప్రాథమిక దశలో గుర్తించినట్లయితే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే సమర్థవంతంగా పంటలను రక్షించుకోవచ్చన్నారు. ఈ విషయంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు,ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రైతులకు సహకరించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశా కుమారి స్పష్టం చేశారు.



కొత్త రోడ్డు కిందిభాగం బురదమయంగా మారిన దృశ్యం

## ర్యాంపు నిర్మాణం చేయక వాహనాల రాకపోకలు ఇబ్బందులు

**జోగిపేట, జులై28, ప్రభాతవార్త:** రోడ్డు నిర్మాణం చేసినప్పటికీ పక్కన మొరం వేయకపోవటంతో తీవ్ర తమ ఇండ్లకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూన్నామని అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఫైర్‌స్టేషన్ వెనకాల ఉన్న కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఇటీవలే నూతనంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. అయితే కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు ఎత్తు ఎక్కువగా ఉండటం, గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రోడ్డు కిందివైపు పూర్తిగా బురదగుంటగా మారంటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తమ కాలనీకి పక్కనే ఉన్న మరో వెంచరకు మాత్రం ర్యాంపు నిర్మాణం చేశారని, అదే తమ కాలనీకి కూడా ర్యాంపు నిర్మాణం చేయాలని లేదా కనీసం రోడ్డుకు సమానంగా మొరం అయినా వేయాలని సదరు కాంట్రాక్టర్‌ను కోరినా ఎలాంటి స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమ ఇబ్బందులు తొలగేలా మున్సిపల్ కమీషనర్ చర్యలు తీసుకోవాలని బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి సుమన్ కోరారు.

## సన్మానం అందుకున్న విద్యార్థి చౌహాన్ అర్జున్

**కంగ్టి, జులై 28, ప్రభాతవార్త:** ఉత్తరఖాండ్ రాష్ట్రంలోని రూర్కిలో ఐఐటి విద్యాలయంలో సీటును దక్కించుకున్న విద్యార్థి చౌహాన్ అర్జున్‌ను ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని రాజారాం తండాకు చెందిన చౌహాన్ అర్జున్ ఐఐటిలో సీటు పొంది తమ తండాకు మంచి పేరు తీసుకువచ్చారని తండా సర్పంచన రాథోడ్ పల్లవి పర్సురామ్ ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకుంటే భవిష్యత్తు బంగారుమయం కావడం తథ్యమన్నారు. చౌహన్ అర్జున్‌ను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ సూచించారు.

## ఉత్సవాలకు మాజీ ఎంపికి ఆహ్వానం



సురేష్ శెట్కార్‌కు ఆహ్వాన పత్రిక అందచేస్తున్న దోసపల్లి గ్రామస్థులు

**మనూర్, జులై 28, ప్రభాతవార్త:** మండలంలోని దోసపల్లి గ్రామంలో ఈ నెల 30వ తారీఖున నిర్వహించే గ్రామ దేవతల పునశ్చరణ, బోనాల పండగ కార్యక్రమాలకు హాజరు కావాలంటూ శుక్రవారం మాజీ ఎంపి, టిపిసిసి ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్ శెట్కార్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్‌కుమార్ శెట్కార్‌లకు ఆహ్వాన పత్రికను అందచేసి ఆహ్వానించారు. ఈ సందర్బంగా గ్రామస్థులు సురేష్ శెట్కార్, నాగేష్ శెట్కార్‌లకు శాలువాతో సన్మానించి ఉత్సవాలకు హాజరుకావాలని తెలిపారు, ఉత్సవాలకు హజరై అమ్మవారి అశీస్సులు అందుకుంటామని నాయకులు గ్రామస్థులకు హామి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నేత సాగర్ శెట్కార్, దత్తు నారాయణ, ఈరన్న, గాలప్ప, మారుతి, సత్యనారాయణ, ఉమా కాంత్, శరణప్ప, కుసప్ప తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐకి ఘనంగా సన్మానం

**సిర్గాపూర్, కల్హేర్ 28 ప్రభాతవార్త:** కల్హేర్ మండల నూతన ఎస్.ఐ.గా బదిలీపై వచ్చిన వెంకటేశంకు కృష్ణాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు గుండమ్మ అంజయ్య సాగర్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలదండలతో ఘనంగా శుక్రవారం సన్మానించారు. ఇక్కడ ఎస్.ఐ.గా పనిచేసిన ప్రశాంత్ సర్కిల్ ఇన్స్‌పెక్టరుగా ప్రమోషన్ రావడంతో ఆయన స్థానంలో కల్హేర్ ఎస్ఐ.గావెంకటేశం పదవి బాధ్యతలు స్వీకరించారు. సన్మానం చేసిన వారిలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జిల్లా కో ఆప్షన్ మెంబర్ అలీ, ఆత్మ చైర్మన్ రాంసింగ్, వైస్ ఎంపీపీ అధ్యక్షులు నారాయణరెడ్డి,సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, బాలయ్య, యాకూబ్, రవి, ప్యాక్స్ చైర్మన్ సంగారెడ్డి, భూ మన్న, భాస్కర్, జనార్థన్‌రెడ్డి, సంగన్న తదితరులు ఉన్నారు.

## చికిత్సపొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**కంది, జులై 28, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రిలో చికత్స అందుకుంటూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన కంది గ్రామ శివారులో ఓకినోవా ఎలక్ట్రిక్ బైక్ షోరూం వద్ద, జాతీయ రహదారిపై ఈ నెల 24వ తారీఖున గుర్తు తెలియని వ్యక్తి (50-55) రోడ్డుపై పడి ఉండగా పంచాయితీ కార్యదర్శి బుర్రా విద్యాదర్‌గౌడ్ గుర్తు తెలియని వ్యక్తిని 108 వాహనంలో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ ఈ నెల 27వ తారీఖున తిరిగిరాని లోకాలకు చేరిపోయాదన్నారు. పంచాయితీ కార్యదర్శి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## చౌటకూరులో ఘనంగా మోహరం సంబరాలు



చౌటకూరు గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

**చౌటకూరు, జులై 28, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో శుక్రవారం మోహరం ఉత్సవాలను సంతోషాలతో ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాలను పురష్కరించుకుని గ్రామంలో ప్రతిష్ఠించిన బి ఫాతిమా పీర్లకు నూతన దట్టీలు కప్పి భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## ఎంపి సోయం బాపూరావ్ దిష్టిబొమ్మ దహనం

**జహీరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** లంబాడీ సుగాలిలను ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలని అని అదిలాబాద్ ఎంపి సోయం బాపూరావ్ లేఖ రాయడం పట్ల నియోజకవర్గ బంజారా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా బంజారా నాయకులు మాట్లాడుతూ లంబాడీల జోలికి వస్తే ఉరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సందర్బంగా ఎంపి సోయం బాపూరావ్ దిష్టిబొమ్మను ఊరేగించి దగ్ధం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, శ్రీ సేవాలాల్ కమిటి నాయకులు శ్రీనివాస్ నాయక్, వాసు నాయక్ రఘునాథ్ రాథోడ్, హీరు రాథోడ్, రామ్‌సింగ్, చందర్, రాజు నాయక్, రవి చావాన్ ప్రేమ్ సింగ్, పాండు సింగ్, మోహన్ నాయక్, చందు కిషన్, హుగ్గెల్లి జైపాల, దశరథ్, చిన్న రాజు, సురేష్ చైహాన్ శ్రీను బానోత్, రవి రాథోడ్, గోవర్దన్, విజయ్ రాథోడ్, గోపాల్, తులసిరాం రాథోడ్, హనుమంత్ చావాన్ తదితరులు పాల్గొన్నారు.